క్లుప్తంగా

మంత్రి, డిప్యూటీ సీఎంను కలిసిన నాయకులు

ఖమ్మంరూరల్: డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని మండల కాంగ్రెస్ నాయకులు మద్ది వీరారెడ్డి, సంగయ్యచారి బుధవారం హైదరాబాద్‌లో కలిశారు. ఈ సందర్భంగా తీర్థాల జాతర వస్తున్నందున పల్లెగూడెం నుంచి తీర్థాల వరకు రోడ్డు మరమ్మతులు చేపట్టాలని విన్నవించారు. గోళ్లపాడు నుంచి గూడురుపాడు వరకు బీటీ రహదారి నిర్మించాలని కోరారు. దొడ్డ నాగేశ్వరరావు, బాల కోటేశ్వరరావు తదితరులున్నారు.

ఎంపీని కలిసిన సర్పంచ్

కామేపల్లి: ఎంపీ వద్దిరాజు రవిచంద్ర పుట్టినరోజు సందర్భంగా పొన్నేకల్ సర్పంచ్ నాగండ్ల లక్ష్మణ్‌చౌదరి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీని ఖమ్మంలో కలిసిన ఆయన పుష్పగుచ్ఛం అందజేశారు.

పరిశుభ్రతతోనే ఆరోగ్యం

కామేపల్లి: విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం ద్వారా ఆరోగ్యం సొంతమవుతుందని పీహెచ్‌సీ వైద్యాధికారి శిరీష తెలిపారు. స్థానిక బాలికల గిరిజన ఆశ్రమ పాఠశాలలోని విద్యార్థులకు పీహెచ్‌సీ ఆధ్వర్యాన బుధవారం రక్త పరీక్షలు చేశారు. అనంతరం ఆరోగ్యానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డాక్టర్ మణి, మాధవి, హెచ్‌ఈఓ దూప్‌సింగ్ పాల్గొన్నారు.

మృతికి సంతాపం

ఖమ్మంవ్యవసాయం: ఖమ్మం చాంబర్ ఆఫ్ కామర్స్ దాల్ మిల్ శాఖ సభ్యులు మిట్టపల్లి గురునాథం (85) మృతి చెందగా చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు బుధవారం నివాళులర్పించారు. కార్యక్రమంలో చాంబర్ ఆఫ్ కామర్స్ గౌరవ అధ్యక్షుడు మేళ్లచెరువు వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి మెంతుల శ్రీశైలంతోపాటు మన్నెం కృష్ణ, పాయల నాగేశ్వరరావు, శ్రీనివాసరావు, రాయపు వెంకటరామారావు, తూములూరి లక్ష్మీనరసింహారావు, పుల్లఖండం రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాలపై ప్రత్యేక శిక్షణ

ఖమ్మంమామిళ్లగూడెం: వృద్ధులు, అనాథలు, దివ్యాంగుల సమస్యలు, వారి కోసం చేపట్టాల్సిన సేవా కార్యక్రమాలపై హైదరాబాద్‌లో నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషల్ డిఫెన్స్ ఆధ్వర్యాన రెండు రోజుల పాటు శిక్షణ ఏర్పాటు చేశారు. ఈ శిక్షణలో ఖమ్మానికి చెందిన బాలు ట్రస్ట్ చైర్మన్ బాలు పాల్గొన్నారు. కాగా, ఈ శిక్షణతో సేవా కార్యక్రమాలపై మరింత అవగాహన పెరిగిందని ఆయన తెలిపారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

నేలకొండపల్లి: వాహనదారులు తప్పనిసరి ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని నేలకొండపల్లి ఏఎస్ఐ కె.కోడెత్రాచు సూచించారు. రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా మండల కేంద్రంలో బుధవారం అవగాహన సదస్సు నిర్వహించగా ఆయన మాట్లాడారు. వాహనం నడిపే సమయాన కుటుంబం బాధ్యతను గుర్తుంచుకుంటే ప్రమాదాలు జరగవని తెలిపారు. కాగా, నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

అభివృద్ధికి సహకరించాలి

రఘునాథపాలెం: ప్రజలందరూ ఇంటిపన్నులు చెల్లించి పంచాయతీల అభివృద్ధికి సహకరించాలని ఎంపీఓ శ్రీనివాస్‌రెడ్డి కోరారు. మండలంలోని చింతగుర్తి, గణేశ్వరం గ్రామాల్లో బుధవారం పర్యటించిన ఆయన ఇంటి పన్నుల వసూళ్లపై సమీక్షించి ప్రజలకు అవగాహన కల్పించారు. మండలంలో ఇప్పటి వరకు 34 శాతమే పన్నులు వసూలైనందున సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.

ఎల్‌ఈడీ బల్బుల పంపిణీ

రఘునాథపాలెం: రఘునాథపాలెంలో సబ్సిడీపై ఎల్‌ఈడీ బల్బులు పంపిణీ చేస్తున్నారు. బల్బులు కావాల్సిన వారు గత మూడు నెలల్లో ఏదైనా కరెంట్ బిల్లు సమర్పించి ఐదు ఎల్‌ఈడీ బల్బులు తీసుకోవచ్చని గ్రామపంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్‌కుమార్ తెలిపారు. గురువారం రఘునాథపాలెం జీపీలో సంప్రదించాలని సూచించారు.

రఘునాథపాలెంలో ర్యాలీ

రఘునాథపాలెం: జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా బుధవారం మండల కేంద్రమైన రఘునాథపాలెం గ్రామంలో అవగాహన కార్యక్రమంతోపాటు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గుడిపుడి శారద, స్కూల్ హెచ్‌ఎం వెంకటేశ్వర్లు, వార్డ్ సభ్యులు, ఉపాధ్యాయులు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కిరణ్‌కుమారి, టీచర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

పశు వైద్యశిబిరం

ఖమ్మంరూరల్: మండలంలోని గుదిమళ్ల గ్రామంలో బుధవారం గోపాలమిత్ర పశు వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా పశువైద్యులు అనంతు హరీశ్ మాట్లాడుతూ పశువులకు ఈ సీజన్‌లో వచ్చే గర్భకోశ వ్యాధి విషయంలో రైతులు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ఈ సందర్భంగా దూడలకు నట్టల నివారణ మందు పంపిణీ చేసి, పశువులకు సాధారణ చికిత్స అందించారు. కార్యక్రమంలో రైతులు వెంకటేశ్వర్లు, సందీప్, నవీన్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

దూరంగానే ఉండిపోయాం..

నగరానికీ.. అభివృద్ధికీ.. అంటున్న దానవాయిగూడెం వాసులు

- కేఎంసీలో విలీనమై దశాబ్దం దాటినా పట్టింపు లేదు
- అధ్వానంగా అంతర్గత రోడ్లు, డ్రెయినేజీ వ్యవస్థ
- తటాకంలా దర్శనమిస్తున్న ఖాళీ స్థలాలు


దానవాయిగూడెంలో అధ్వానంగా ఉన్న అంతర్గత రోడ్లు


కచ్చా కాల్వలో నిలిచిన మురుగులో పందులు


ఖాళీ స్థలాల్లో చేరిన మురుగునీరు

ఖమ్మంమయూరిసెంటర్: దశాబ్ద కాలం కిందట ఖమ్మం మున్సిపాలిటీ కార్పొరేషన్‌గా అప్‌గ్రేడ్ అయిన సమయాన ప్రస్తుత 59వ డివిజన్ దానవాయిగూడెం ప్రాంతాన్ని కేఎంసీలో విలీనం చేశారు. అయితే, ఏళ్లు గడిచినా, పాలకవర్గాలు మారినా.. ఆ ప్రాంతంలో అభివృద్ధి కనుచూపు మేర కనిపించడం లేదు. అంతర్గత రోడ్లు, డ్రెయినేజీ వ్యవస్థ, పారిశుద్ధ్య సమస్యలు స్థానికులను వేధిస్తున్నాయి. అందరితో సమానంగా పన్నులు వసూలు చేస్తున్న అధికారులు తమ సమస్యలను పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన చెందుతున్నారు.

పేరుకే కార్పొరేషన్‌లో..

పాలేరు నియోజకవర్గంలో ఉన్న దానవాయిగూడెం ప్రాంతాన్ని పదేళ్ల కిందట ఖమ్మం నియోజకవర్గంలో ఉన్న కేఎంసీలో విలీనం చేశారు. అయినా అభివృద్ధికి అడుగులు పడలేదు. ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్‌కు వస్తున్న నిధులు, ఆదాయంలో ఎక్కువ శాతం కొన్ని ప్రాంతాలకే ఖర్చు చేయడంతో విలీన ప్రాంతాల్లో అభివృద్ధి కుంటుపడిందని చెబుతున్నారు. ఆ ప్రాంతం పాలేరు నియోజకవర్గంలో ఉండటంతో ఖమ్మం ఎమ్మెల్యే పట్టించుకోలేదన్న వాదనా ఉంది. తమ ఓట్లు ఖమ్మం నియోజకవర్గంలో లేనందునే నిధులు కేటాయించడం లేదని స్థానికులు పేర్కొంటున్నారు.

అధ్వానంగా రోడ్లు, డ్రెయినేజీలు

కేఎంసీ పరిధి 59వ డివిజన్‌లోని దానవాయిగూడెంలో అంతర్గత రోడ్లు సక్రమంగా లేవు. ప్రధాన రోడ్లు రెండు, మూడింట్లో ఇటీవల ఎస్‌డీఎఫ్ నిధుల ద్వారా సీసీ రోడ్లు నిర్మించినా మిగతా అంతర్గతంగా రోడ్లన్నీ మట్టి రోడ్లే. దానవాయిగూడెం కాలనీలోని ప్రధాన రహదారికి ఇరుపక్కలా అంతర్గత రోడ్లు మోకాల లోతులో ఉండి, గుంతలు, రాళ్లమయంగా మారాయి. వీటిపై ద్విచక్ర వాహనాలను భయంగా నడుపుతున్నామని స్థానికులు చెబుతున్నారు. ఇక వర్షాకాలం వస్తే తమ పరిస్థితి పట్టణంలో ఉన్నామా.. ఏజెన్సీలో ఉన్నామా అన్నట్లు మారుతోందని పేర్కొంటున్నారు. కాగా, కేఎంసీలో ప్రతి వీధిలో డ్రెయినేజీ నిర్మించాలని పాలకులు నిర్ణయించారు. సీఎం వాగ్దాన నిధులు, ఎస్‌డీఎఫ్, సుడా, ఎల్ఆర్ఎస్ వంటి వాటి నుంచి సమకూరిన నిధులతో రోడ్లు, డ్రెయినేజీలు నిర్మిస్తామని చెప్పారు. కానీ దానవాయిగూడెంలో మాత్రం డ్రెయిన్లు నిర్మించలేదు. ఫలితంగా ఇళ్ల నుంచి వచ్చే మురుగు ఖాళీ స్థలాల్లోకి చేరి తటాకాల్లా మారాయి. అందులో పందులు సంచరిస్తుండటంతో దుర్వాసన, దోమలతో స్థానికులు అవస్థ పడుతున్నారు.

సమస్యలు పట్టించుకోవడం లేదు



మా ప్రాంతాన్ని కార్పొరేషన్‌లో విలీనం చేసి ఏళ్లు దాటినా సౌకర్యాలు లేవు. రోడ్లు, డ్రెయినేజీలు లేక ఇబ్బంది పడుతున్నాం. మా ప్రాంత సమస్యలనెవరూ పట్టించుకోవడం లేదు. అధికారులెవరూ ఇటువైపు రారు. ఇప్పటికైనా నిధులు కేటాయించి అభివృద్ధి చేయాలి.

–ఎస్‌కే హుస్సేన్, దానవాయిగూడెం

శివారు ప్రాంతంగానే చూస్తున్నారు..



కేఎంసీలో దానవాయిగూడెంను విలీనం చేసినప్పటి నుంచి శివారుగా చూస్తున్నారు తప్ప నగరంలో భాగంగా గుర్తించడం లేదు. అభివృద్ధిని మున్సిపల్, ప్రభుత్వ పాలకులు పట్టించుకోవడం లేదు. ఇకనైనా మా ప్రాంత అభివృద్ధికి కృషి చేయాలి.

–మాచర్ల గోపి, దానవాయిగూడెం

గ్రామాలు ఇంతకంటే అభివృద్ధి చెందాయి..



మా ప్రాంతం అభివృద్ధికి నోచుకోవడం లేదు. ఏ గ్రామీణ ప్రాంతానికి వెళ్లినా రోడ్లు, డ్రెయిన్లు ఉన్నాయి. కానీ కేఎంసీలో కలిసిన దానవాయిగూడెంలో మాత్రం కానరావు. కార్పొరేషన్‌లో కలవకపోయినా ఇక్కడ అభివృద్ధి చెందేదని అనిపిస్తోంది.

–చుంచు బాబు, దానవాయిగూడెం

నాసిరకం సామగ్రి వినియోగిస్తున్నారని ఫిర్యాదు

నేలకొండపల్లి: మండలంలోని భైరవునిపల్లి గ్రామ పంచాయతీ భవన నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించటం లేదని గ్రామానికి చెందిన మరికంటి రమేశ్, తదితరులు ఆరోపించారు. ఈ సందర్భంగా బుధవారం వారు పంచాయతీ అధికారులకు ఫిర్యాదు చేసి వివరాలు వెల్లడించారు. నాసిరకం ఇసుక, సిమెంట్ వినియోగిస్తుండగా, చెరువులోని బురద నీటితో క్యూరింగ్ చేస్తున్నారని తెలిపారు. ఇకనైనా అధికారులు విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.

విద్యార్థుల మెస్ చార్జీలు పెంచాలి

ఖమ్మంమయూరిసెంటర్: వసతిగృహ విద్యార్థులకు సంబంధించి పెండింగ్ డైట్ బిల్లులు విడుదల చేయడమే కాక మెస్ చార్జీలను పెంచాలని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి గోకినేపల్లి మస్తాన్ కోరారు. ఈ మేరకు బుధవారం కలెక్టరేట్ ఏఓకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు మణికంఠ, భాను, వంశీ, గాంధీ తదితరులు పాల్గొన్నారు.

దుప్పట్లు పంపిణీ

ఖమ్మంఅర్బన్: నగరంలోని పాండురంగాపురం ప్రభుత్వ పాఠశాలకు చెందిన 582 మంది విద్యార్థులకు గ్రేస్ సొసైటీ ఆధ్వర్యాన బుధవారం దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ప్రేమలత, ఉపాధ్యాయులు రమేశ్, సతీశ్, మురళి, రెడ్డి, జాన్ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తు చేసుకోవాలి

కామేపల్లి: పట్టభద్రులందరూ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటుహక్కు కోసం దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ సుధాకర్ తెలిపారు. స్థానిక కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడుతూ.. డిగ్రీ మెమో జిరాక్స్‌పై గెజిటెడ్ సంతకం చేయించుకున్నాక దరఖాస్తులు అందించాలని సూచించారు. ఈ అవకాశాన్ని అర్హులైన వారందరూ సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

మార్కెట్లలోనే వ్యాపారాలు చేయాలి


ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌లో పరిశీలిస్తున్న కమిషనర్ ఆదర్శ్‌సురభి

సాక్షి ఎఫెక్ట్..

ఖమ్మంమయూరిసెంటర్: వీధి వ్యాపారులు, రైతులు కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్మించిన వీధి వ్యాపారుల ప్రాంగణాలు, మార్కెట్లలో మాత్రమే విక్రయించాలే తప్ప రోడ్లపైకి రావొద్దని కేఎంసీ కమిషనర్ ఆదర్శ్ సురభి సూచించారు. 'సాక్షి'లో బుధవారం 'మూన్నాళ్లముచ్చటే..' శీర్షికన వీధి వ్యాపారుల ప్రాంగణాలు వెలవెలబోతున్న అంశంపై ప్రచురితమైన కథనానికి కమిషనర్ స్పందించారు. ఈ సందర్భంగా నగరంలోని ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌ను సందర్శించి సౌకర్యాలను పరిశీలించారు. రైతులు, వీధి వ్యాపారులు రోడ్ల వెంట ఎందుకు విక్రయాలు చేపడుతున్నారని ఆరా తీశారు. ప్రాంగణాల్లో సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. కమిషనర్ వెంట డీఈఈ నవ్యజ్యోతి, ఉద్యోగులు ఉన్నారు.

ఘనంగా జాతీయ ఓటర్ల దినోత్సవం


ఖమ్మంరూరల్: చిత్రాలతో చిన్నారులు

ఖమ్మంరూరల్: మండలంలోని తెల్దారుపల్లి ఉన్నత పాఠశాలలో బుధవారం జాతీయ ఓటర్ల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. గెలుపొందిన విజేతలకు బహుమతుల ప్రదానం చేశారు. కాగా, పోటీల్లో విద్యార్థులు ప్రదర్శించిన చిత్రాలను మండల స్థాయికి పంపించినట్లు హెచ్‌ఎం శాంతిసుధ తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

తిరుమలాయపాలెంలో..

తిరుమలాయపాలెం: జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని గురువారం మండలంలోని అన్ని పోలింగ్ బూత్‌లలో నిర్వహించాలని మండల తహసీల్దార్ రామ్‌ప్రసాద్ తెలిపారు. కలెక్టర్ వీపీ గౌతమ్ ఆదేశాల మేరకు అన్ని పోలింగ్‌బూత్‌లలో ఓటు హక్కు ప్రాధాన్యతపై వ్యాసరచన పోటీలు, ముగ్గుల పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో యువ, సీనియర్ ఓటర్లు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

పొంగులేటి నివాసానికి దీపాదాస్ మున్షీ


దీపాదాస్‌మున్షీని ఆహ్వానిస్తున్న మంత్రి పొంగులేటి

ఖమ్మంవన్‌టౌన్: తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జ్ దీపాదాస్ మున్షీ బుధవారం హైదరాబాద్‌లోని రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి నివాసానికి వచ్చారు. మంత్రి ఆహ్వానం మేరకు మున్షీ పొంగులేటి నివాసానికి రాగా, ఆమెను శాలువాతో సత్కరించారు. అలాగే, దీపాదాస్ మున్షీని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, మాజీ ఎమ్మెల్సీ పోట్ల నాగేశ్వరరావుతో పలువురు నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు.

జీవీ ఫౌండేషన్ ఆధ్వర్యాన 'యువచైతన్యం'


యువ చైతన్యంలో పాల్గొన్న ఫౌండేషన్ బాధ్యులు

ఖమ్మంమయూరిసెంటర్: గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ఖమ్మంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో బుధవారం డాక్టర్ జీవీ ఫౌండేషన్ ఆధ్వర్యాన యువచైతన్యం కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా 75 మీటర్ల జాతీయ పతాకాన్ని ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ జి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. విద్యార్థినులు మానసికంగా ధైర్యంగా ఉంటూ ఒత్తిళ్లను జయించాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ ఝాన్సీరాణితోపాటు డాక్టర్ మానస, మోత్కూరి నారాయణరావు, సతీశ్, ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

సభ్యుల సహకారంతో అభివృద్ధి

నేలకొండపల్లి: నేలకొండపల్లి మేజర్ గ్రామ పంచాయతీ అభివృద్ధిలో పాలకవర్గ సభ్యుల సహకారం మరువలేనిదని సర్పంచ్ రాయపూడి నవీన్ పేర్కొన్నారు. పంచాయతీ కార్యాలయంలో బుధవారం పాలకవర్గ చివరి సమావేశం బుధవారం నిర్వహించగా ఆదాయ, వ్యయాలను ఏకగ్రీవంగా ఆమోదించారు. అనంతరం సర్పంచ్ మాట్లాడుతూ.. అన్ని వార్డులను దశలవారీగా అభివృద్ధి చేశామని తెలిపారు. ఎంపీటీసీ సభ్యులు బొందయ్య, శీలం వెంకటలక్ష్మి, లక్కం ఏడుకొండలు, దేవేందర్, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

జీపీ నిధుల వివరాలు వెల్లడించాలి

నేలకొండపల్లి: మండలంలోని ముజ్జుగూడెం గ్రామ పంచాయతీకి వచ్చిన నిధులు, వినియోగం తదితర వివరాలు ఇవ్వాలని కాంగ్రెస్ నాయకుడు వేగినాటి లక్ష్మీనర్సయ్య కోరారు. ఆయన సమాచార హక్కు చట్టం ద్వారా పంచాయతీ కార్యదర్శికి బుధవారం వినతిపత్రం అందజేశారు. పంచాయతీలో నిధుల వినియోగంలో అవకతవకలు జరిగాయన్న ఆరోపణల నేపథ్యాన వివరాలు ఇవ్వాలని కోరారు. నాయకులు ఉండమోదుగుల శ్రీనివాసరావు, తన్నీరు వెంకటనారాయణ, రేగళ్ల నాగేందర్, షేక్ యాకూబ్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో క్రీడాదినోత్సవం

ఖమ్మంసహకారనగర్/ఖమ్మంస్పోర్ట్స్: నగరంలోని విస్‌ఫీల్డ్, త్రివేణి, ఢిల్లీ పబ్లిక్ స్కూళ్లలో క్రీడా దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ ఆటలతో మానసికోల్లాసం, శారీరక దృఢత్వం చేకూరుతాయని తెలిపారు. విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని ఆకాంక్షించారు.

కాంగ్రెస్ పాలనలో గొల్ల, కురుమలకు న్యాయం

కామేపల్లి: కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో యాదవ, కురుమలకు న్యాయం జరుగుతుందని, ఎవరూ ఆందోళన చెందాల్సిన పనిలేదని డీసీసీబీ డైరెక్టర్ మేకల మల్లిబాబుయాదవ్ అన్నారు. బుధవారం మండలంలోని మద్దులపల్లి గ్రామంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వం యాదవ, కురుమలకు అన్యాయం చేసిందని ఆరోపించారు. ఎందరో నిరుపేద జీవాల పెంపకందారులు గొర్రెల కోసం డీడీలు తీశారని, కానీ గత ప్రభుత్వం గొర్రెలు ఇవ్వకుండా కాలయాపన చేసి మోసం చేసిందని మండిపడ్డారు. గడ్డం వెంకన్న, ఇమ్మడి రామనాథం, గోపిరెడ్డి వెంకటరెడ్డి, కాత్రాల వీరబాబు, గడ్డం శ్రీను, జాలె శ్రీను, మల్లయ్య, గడ్డికొప్పుల నారాయణరెడ్డి, కృష్ణ, ఉపేందర్ పాల్గొన్నారు.

వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ

తిరుమలాయపాలెం: తెలంగాణ గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ ప్రథమ రాష్ట్ర మహాసభల పోస్టర్లను బుధవారం పిండిప్రోలులో యూనియన్ నాయకులు ఆవిష్కరించారు. ఈ నెల 28న వనపర్తి పట్టణంలో జరిగే మహాసభల్లో కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో పంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకులు మేకల సైదులు, నాయకులు కత్తుల భిక్షం, నాగన్న, పుల్లయ్య, పాలమల్ల వెంకన్న, నాగయ్య, కత్తుల యేసు పాల్గొన్నారు.

మాదిగలకు రెండు సీట్లు కేటాయించాలి

ఖమ్మంమామిళ్లగూడెం: వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో మాదిగలకు రెండు సీట్లతో పాటు జనాభా దామాషా ప్రకారం నామినేటెడ్ పోస్టులు కేటాయించాలని మాదిగ హక్కుల దండోరా రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కొరిపల్లి శ్రీనివాస్‌మాదిగ కోరారు. హైదరాబాద్‌లో బుధవారం రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహను కలిసి వినతిపత్రం అందజేశారు.

సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి



మాట్లాడుతున్న శింగు నరసింహారావు

ఖమ్మంమయూరిసెంటర్: సంఘటిత, అసంఘటిత రంగాల కార్మికుల సమస్యలు పరిష్కరించాలనే డిమాండ్‌తో ఫిబ్రవరి 16న నిర్వహిస్తున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. ఖమ్మంలోని ఏఐటీయూసీ కార్యాలయంలో బుధవారం జిల్లా అధ్యక్షుడు గాదే లక్ష్మీనారాయణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఏఐటీయూసీ, సీఐటీయూ, ఐఎఫ్‌టీయూ, బీఆర్‌టీయూ, ఐఎఫ్‌టీయూ సంఘాల నాయకులు పాల్గొని మాట్లాడారు. కాగా, జనవరి 26న రైతు సంఘాల ఆధ్వర్యాన నిర్వహిస్తున్న ట్రాక్టర్ ర్యాలీకి మద్దతు తెలపాలని నిర్ణయించినట్లు తెలిపారు. అలాగే, ఫిబ్రవరి 5న అఖిలపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యంలో మంచికంటి భవన్‌లో జిల్లాస్థాయి సదస్సు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో నాయకులు విప్లవ్‌కుమార్, శింగు నరసింహారావు, తోట రామాంజనేయులు, శివరామకృష్ణ, మోహన్‌రావు, విష్ణు, జి.రామయ్య, లక్ష్మీనారాయణ, ఎండీ పాషా తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి..


సీఎండీకి సమస్యలు వివరిస్తున్న నాయకులు

ఖమ్మంవ్యవసాయం: విద్యుత్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఎన్పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్‌రెడ్డిని యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ (సీఐటీయూ) జిల్లా ప్రతినిధులు కోరారు. ఖమ్మంలో విద్యుత్ సర్కిల్ ఆపరేషన్ నిర్వహణపై సమీక్ష నిర్వహించిన అనంతరం మంగళవారం రాత్రి సీఐటీయూ అనుబంధ విద్యుత్ ఉద్యోగుల సంఘం ప్రతినిధులు మర్యాదపూర్వకంగా సీఎండీని కలిశారు. ఈ సందర్భంగా విద్యుత్ ఉద్యోగులు, కార్మికులు, ఆర్టిజన్లు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించి, వాటిని పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పుష్పరాణి, నాగేశ్వరరావు, ప్రతినిధి సీహెచ్ ముకుందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డైరీ, క్యాలెండర్ల ఆవిష్కరణ


డైరీ, క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న సత్యనారాయణ, తదితరులు


యాదగిరిగుట్టలో క్యాలెండర్లు ఆవిష్కరిస్తున్న బీర్ల ఐలయ్య తదితరులు

ఖమ్మంసహకారనగర్: పెన్షనర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో రూపొందించిన డైరీ, క్యాలెండర్లను ఖజానాశాఖ డిప్యూటీ డైరెక్టర్ వెంటపల్లి సత్యనారాయణ బుధవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షులు పరిశ పుల్లయ్య, నాయకులు కె.కృష్ణమూర్తి, వెంకటేశ్వరరావు, శరత్‌బాబు, శ్రీనివాసరావు, ప్రకాశ్, ట్రెజరీ ఉద్యోగులు ఎల్లయ్య, రవీంద్రబాబు, దుర్గాప్రసాద్, రేష్మా, నగేశ్, ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్ల ఆవిష్కరణ

ఖమ్మంమామిళ్లగూడెం: ఖమ్మం నగర కురుమ సంఘం 2024 నూతన సంవత్సర క్యాలెండర్‌ను బుధవారం బీర్ల ఐలయ్య యాదాద్రి లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో దేవర వెంకన్న, మాలిగ గౌరీశంకర్, మలగ శ్రీను, దయ్యాల రామ్‌మల్లేశం, కాటం కొమరయ్య, జట్ట కిష్టయ్య, మరాటి యాదయ్య, గోరిగ నాగులు, కాటం పెద్ద యాదయ్య, మంగ యాదయ్య పాల్గొన్నారు.

ఎస్‌బీఐటీలో ముగిసిన శిక్షణ


శిక్షణ పొందిన విద్యార్థులతో చైర్మన్ కృష్ణ, అధ్యాపకులు

ఖమ్మంసహకారనగర్: ఖమ్మంలోని ఎస్‌బీఐటీలో ఐదు రోజులుగా నిర్వహిస్తున్న పైథాన్ ప్రోగ్రామింగ్ శిక్షణ బుధవారం ముగిసింది. ఈ సందర్భంగా టాస్క్ టెక్నికల్ ట్రెయినర్ మహ్మద్ జాఫర్‌పాషా విద్యార్థులకు శిక్షణ ఇవ్వగా కళాశాల చైర్మన్ గుండాల కృష్ణ వివరాలు వెల్లడించారు. ప్రస్తుత సమాజంలో డిమాండ్ ఉన్న పైథాన్ శిక్షణ విద్యార్థులకు ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ జి.ధాత్రి, అకడమిక్ డైరెక్టర్లు గంధం శ్రీనివాసరావు, శివప్రసాద్, జి.ప్రవీణ్, రవీంద్రబాబు, ఎస్.శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ రాజ్‌కుమార్‌తో పాటు కె.అమిత్ బింధాజ్, ఎస్.సవిత, జి.ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.